సాక్షి
కాకినాడ
మంగళవారం । 17 । జనవరి । 2023



చెలరేగిన బ్లేడ్ బ్యాచ్


ధవళేశ్వరం గ్రామంలో బ్లేడ్‌బ్యాచ్ దుండగుడు ఓ వ్యక్తిని నడిరోడ్డుపై విచక్షణారహితంగా కత్తితో పొడిచి హతమార్చడం తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. - 8లో▸



కోడిపందేల వద్ద సినీ తారల సందడి

సంక్రాంతి సంబరాలలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని పలు ప్రాంతాల్లో ప్రముఖ సినీ దర్శకులు, నటీనటులు సందడి చేశారు. - 8లో▸

డెల్టాలకు నీరు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు సోమవారం 5,970 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 1,760, మధ్య డెల్టాకు 1,145, పశ్చిమ డెల్టాకు 3,065 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 8.45 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

రత్నగిరికి పోటెత్తిన భక్తులు



సత్యదేవుని వ్రతాలాచరిస్తున్న భక్తులు

అన్నవరం: సంక్రాంతి పండగ సెలవుల నేపథ్యంలో ఆది, సోమవారాల్లో రత్నగిరికి భారీ సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. ఆదివారం సంక్రాంతి పండగ సందర్భంగా 30 వేల మంది, సోమవారం మరో 40 వేల మంది సత్యదేవుని దర్శించుకున్నారు. ఈ రెండు రోజులూ ఉదయం నుంచి సాయంత్రం వరకూ వేలాదిగా తరలివచ్చిన భక్తులతో సత్యదేవుని సన్నిధి కిటకిటలాడింది. దీంతో ఆలయ ప్రాంగణం, వ్రత మంటపాలు, ఘాట్‌రోడ్లు భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఉచిత దర్శనానికి గంట, ప్రత్యేక దర్శనానికి అరగంట పట్టింది. రెండు రోజుల్లో ఐదు వేల వ్రతాలు జరిగాయి. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్త గోకులంలో ప్రదక్షిణ చేసి, రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి, పూజలు చేశారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.70 లక్షల ఆదాయం సమకూరింది. అన్నదాన పథకంలో 8 వేల మందికి ఉచిత భోజన సౌకర్యం కల్పించారు.

కాంట్రాక్టు పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): చేనేత, జౌళి శాఖలో కాంట్రాక్ట్ పద్ధతిలో 14 పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాల చేనేత, జౌళి శాఖ అధికారి కె.పెద్దిరాజు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రానికి ఏడు చేనేత క్లస్టర్లు మంజూరయ్యాయని, వాటిలో తూర్పు గోదావరి జిల్లా పులగుర్త, మురమండ, నంద్యాల జిల్లా బనగానపల్లి, పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ, నారాయణపురం, విజయనగరం జిల్లా బొబ్బిలి, అనకాపల్లి జిల్లా పాయకరావుపేట ఉన్నాయని వివరించారు. వీటిలో ఏడు క్లస్టర్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్, ఏడు క్లస్టర్ డిజైనర్ పోస్టులున్నాయని తెలిపారు. వీటికి ఎంపికైన వారికి మూడేళ్ల పాటు నెలకు రూ.30 వేల వేతనం ఇస్తారన్నారు. ఎగ్జిక్యూటివ్ పోస్టులకు హ్యాండ్‌లూమ్ టెక్నాలజీలో డిప్లొమాతో పాటు రెండేళ్ల అనుభవం, ఎంఎస్ వర్డ్, ఎక్సెల్, పవర్ పాయింట్‌లో పరిజ్ఞానం ఉండాలని వివరించారు. క్లస్టర్ డిజైనర్ల పోస్టులకు టెక్స్‌టైల్ డిజైన్ ఇన్‌స్టిట్యూట్‌లో ఉత్తీర్ణులై, చేనేత విభాగంలో టెక్స్‌టైల్ డిజైనర్‌గా రెండేళ్ల అనుభవం ఉండాలన్నారు. వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీహెచ్ఏఎన్‌డీటీఈఎక్స్.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని పేర్కొన్నారు. 15 రోజుల్లోగా దరఖాస్తు చేసుకోవాలని పెద్దిరాజు సూచించారు.

శతాధిక వృద్ధుడి మృతి



శ్రీరామతారకరావు (పాతచిత్రం)

కరప: మండలంలోని వేళంగి గ్రామానికి చెందిన శతాధిక వృద్ధుడు చుండ్రు శ్రీరామ తారకరావు (102) మృతి చెందారు. ఆయన 1920 డిసెంబర్ 11న జన్మించిన ఆయన ఈ నెల 12న మరణించినట్టు బంధువులు సోమవారం తెలిపారు. చివరి వరకూ ఆరోగ్యంగా ఉంటూ, తన పనులు తానే చేసుకునేవారని, ఎప్పుడూ ఏ అనారోగ్యం రాలేదని చెప్పారు. శ్రీరామతారకరావుకు భార్య సుబ్బాయమ్మ, ఇద్దరు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. వ్యవసాయం చేసుకుంటూ జీవించిన ఈయన కుమారుడు చుండ్రు వెంకన్నరావు వేళంగి పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా పని చేశారు.

250 కేసులు.. 550 మంది అరెస్టు



గుండాట నిర్వహిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

కాకినాడ క్రైం: జిల్లా వ్యాప్తంగా కోడిపందేలు, జూదం, గుండాట వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలపై పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచారు. భోగి మొదలు కనుమ వరకూ మూడు రోజుల వ్యవధిలో జిల్లాలో 550 మందిని అరెస్టు చేసి, వారిపై 250 కేసులు నమోదు చేశారు. 266 కోడిపుంజులు, 266 కోడికత్తులు స్వాధీనం చేసుకున్నారు. కోడిపందేలు నిర్వహిస్తున్న వారి నుంచి రూ.1,34,380, గుండాట, జూదం ఆడుతున్న వారి నుంచి రూ.1,33,430 చొప్పున నగదు స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు జూదం, గుండాటకు వినియోగించిన బోర్డులు, టేబుల్లను కూడా స్వాధీనం చేసుకున్నామని, బరులు, టెంట్లు ధ్వంసం చేశామని జిల్లా ఎస్పీ ఎం.రవీంద్రనాథ్ బాబు తెలిపారు.

సంక్రాంతి.. సంతోషాల సిరి



అమలాపురంలో జరిగిన కోనసీమ సంక్రాంతి సంబరాల ముగ్గుల పోటీల్లో రంగవల్లులు తీర్చిదిద్దుతున్న మహిళలు



రాజమహేంద్రవరం జాంపేటలో సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్న మహిళలు

- ఉత్సాహంగా మూడు రోజుల పండగ
- సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చిన బంధుమిత్రులు
- ఆనందంగా గడిపిన ప్రజలు
- పలు ప్రాంతాల్లో సినీ ప్రముఖుల సందడి

సాక్షి ప్రతినిధి, కాకినాడ: మూడు రోజుల ముచ్చటైన పండగ సంక్రాంతి.. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఆనంద గోదావరే అయ్యింది. ఉద్యోగాలు, ఉపాధి, వ్యాపారాల కోసం సుదూర ప్రాంతాలకు తరలివెళ్లిన స్థానికులు.. ఈ పండగ వేళ రెక్కలు కట్టుకుని మరీ సొంతూళ్లలో వాలిపోయారు. దీంతో ఎక్కడ చూసినా బంధుమిత్రుల కోలాహలమే కనిపించింది. ధనధాన్యాలు పొంగిపొరలిన వేళ.. ఇంటిల్లిపాదీ ఆనందంగా పండగ జరుపుకొన్నారు. పిల్లలు, పెద్దలు కొత్త దుస్తులు ధరించి మురిసిపోయారు. పిండివంటల రుచులను ఆస్వాదిస్తూ.. ఆటపాటల్లో మునిగి తేలారు. **మహిళలు ముచ్చటైన ముగ్గుల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.** కొంతమంది తమ ఇళ్లల్లో బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు. పూజలు, ప్రభల తీర్థాలు, కోడి పందేలు, సినిమాలు, షికార్లలో ఈ మూడు రోజులూ నిండైన సంతోషంతో గడిపారు. కొన్నిచోట్ల తరతరాల కుటుంబ సభ్యులు కలుసుకుని, కష్టసుఖాలు కలబోసుకున్నారు. సంక్రాంతి పండగ వేడుకగా జరిపారు. ఉమ్మడి జిల్లాకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కుటుంబాలు 30 వేలు పైనే ఉంటాయన్నది అంచనా. కాకినాడ, కోనసీమ, తూర్పు గోదావరి జిల్లాల్లో జరిగిన సంక్రాంతి వేడుకల్లో పలువురు సినీ ప్రముఖులు సందడి చేశారు. దర్శకులు కురసాల కల్యాణకృష్ణ, వీవీ వినాయక్, రాంగోపాల్‌వర్మ, బాబీ, శ్రీవాస్, ఎడిటర్ చోటా కె ప్రసాద్, వర్ధమాన హీరో కిరణ్ అబ్బవరంతో పాటు సినీ నటులు కృష్ణుడు, హేమ, బుల్లితెర నటులు పలు ప్రాంతాల్లో జరిగిన సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్నారు.

సంప్రదాయంగా కోడిపందేలు

మూడు జిల్లాల్లోనూ సంక్రాంతి కోడిపందేలు సంప్రదాయకంగా నిర్వహించారు. వీటిని తిలకించేందుకు సుదూర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ఔత్సాహికులు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు తరలివచ్చారు. మునుపటి కంటే కాస్త తక్కువ స్థాయిలో జరిగినా సంప్రదాయకంగా సాగే కోడిపందేలకు ఎక్కడా ఆటంకాలు ఎదురు కాలేదు. పోలీసులు పట్టు బిగించడంతో భోగి నాడు సగానికి సగం బరుల్లో పందేలు నిర్వహించలేదు. మొదటి రోజుతో పోలిస్తే సంక్రాంతి, కనుమ నాడు మాత్రం పందేలు కాస్త జోరందుకున్నాయి. సినీ ప్రముఖులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు కోడిపందేలను వీక్షించారు. ఈ మూడు రోజులూ ఉమ్మడి జిల్లాలో సుమారు 300 బరుల్లో కోడిపందేలు నిర్వహించారు. గుండాటలకు పోలీసులు విజయవంతంగా బ్రేక్ వేయడంతో **నిర్వాహకులకు నిరుత్సాహం తప్పలేదు.**

పెరిగిన మద్యం అమ్మకాలు

గత ఏడాది సంక్రాంతి సీజన్‌తో పోలిస్తే ఈసారి మద్యం విక్రయాలు పెరిగాయి. భోగి పండగ మధ్యాహ్నం వరకూ మద్యం అమ్మకాలు సాదాసీదాగానే జరిగాయి. సాయంత్రం 4 నుంచి మాత్రం ఒకేసారి మందుబాబులు ఆయా దుకాణాలకు, బార్ అండ్ రెస్టారెంట్లకు క్యూ కట్టారు. సాధారణ రోజుల్లో ఒక్కో మద్యం దుకాణంలో రూ.1.50 లక్షల విక్రయాలు జరుగుతాయి. అటువంటిది ఈ పండగల్లో ప్రతి రోజూ ఒక్కో దుకాణంలో రూ.4 లక్షల వరకూ విక్రయాలు జరిగినట్టు చెబుతున్నారు. ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ సామర్లకోట డిపో పరిధిలో రూ.13,83,48,090, రాజమహేంద్రవరం డిపో పరిధిలో రూ.12,10,54,810, అమలాపురం డిపో పరిధిలో రూ.8.01 కోట్ల మేర మద్యం అమ్మకాలు జరిగాయి.

మరికొందరిపై వేటుకు సిద్ధం!

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 14వ, 15వ గ్రాడ్యుయేషన్ డే నిర్వహణలో లోపాలకు సంబంధించి మరికొందరిపై చర్యలు తీసుకోనున్నట్టు తెలిసింది. ఈ నెల 3న జరిగిన ఈ వేడుకలకు రాష్ట్ర కాలేజీ విద్య కమిషనర్ పోలా భాస్కర్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించారు. ఆహ్వాన పత్రికల ముద్రణ వంటివన్నీ ఉన్నప్పటికీ.. నగరానికి వచ్చినప్పటి నుంచీ ఆయనకు ప్రత్యేక సదుపాయాలేవీ కల్పించలేదు. పైగా వేడుకల సమయానికి వచ్చిన ఆయన సాధారణ వ్యక్తిలా గడపాల్సి వచ్చింది. క్రమశిక్షణ, సమయ పాలన లేకపోవడంతో కార్యక్రమానికి వచ్చిన గంటకే పది కంటే తక్కువ మందికి సర్టిఫికెట్లు అందజేసి ఆయన వెళ్లిపోయారు. విద్యార్థుల క్రమశిక్షణ ఏర్పాట్ల వంటి వాటిని కారణాలుగా చూపుతూ గత వారం ప్రిన్సిపాల్ తిరుపాణ్యాన్ని చోడవరం బదిలీ చేశారు. ఏదైనా కార్యక్రమం నిర్వహించే ముందు ఆహ్వాన కమిటీ, ఆడిటోరియం పర్యవేక్షణ తదితర టీములను ఏర్పాటు చేయాలి. ఎవ్వరికీ ఎటువంటి అసౌకర్యం లేకుండా చూడాలి. గతంలో ఇటువంటి సమస్య ఎప్పుడూ ఉత్పన్నం కాలేదు. తొలిసారిగా ఈవిధంగా జరగడం, ప్రిన్సిపాల్‌ను ఆగమేఘాల మీద బదిలీ చేయడం కళాశాలలో హాట్ టాపిక్‌గా మారింది. గ్రాడ్యుయేషన్ డే వేడుకల నిర్వహణ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్‌కు సంబంధించినది కావడంతో.. ఆ శాఖ ముఖ్య అధికారితో పాటు మరికొందరిపై కూడా చర్యలు తీసుకోవడానికి సిద్ధమైనట్టు ఉన్నత విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం నుంచి సమాచారం వచ్చింది. దాదాపు ఐదేళ్ల పైబడి ఒకరే కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినర్‌గా ఉన్నారు. కొత్తగా చేరిన ప్రిన్సిపాల్ కళాశాలలోని వివిధ విభాగాలను ప్రక్షాళన చేసేందుకు కసరత్తు చేస్తున్నట్టు సమాచారం.

ప్రభంజనం



పి.గన్నవరం మండలం కుందాలపల్లి డ్యామ్ సెంటర్‌కు పంట చేల మీదుగా ప్రభను మోసుకువస్తున్న భక్తులు



అంబాజీపేట మండలం జగ్గన్నతోట ప్రభల తీర్థానికి వచ్చిన భక్తులతో కిటకిటలాడుతున్న వంతెనలు

- తీర్థాలకు పోటెత్తిన భక్తులు
- జగ్గన్నతోట తీర్థానికి 60 వేల మందిపైనే

సాక్షిఅమలాపురం/అంబాజీపేట/కొత్తపేట/మామిడికుదురు: సోమవారం... పరమ శివునికి ప్రీతిపాత్రమైన రోజు... ఈ రోజు వీరభద్రుని అంశమైన 'ప్రభ'పై పరమ శివుడు కొలువై తీర్థాలకు వచ్చి భక్తులకు దర్శనమిస్తాడు. సంప్రదాయానికి... సెంటిమెంట్ కూడా తోడయ్యింది.... దీనితో భక్తజనంతో జిల్లాలోని ప్రభల తీర్థాలు జన సంద్రాలను తలపించాయి. వందల మంది భక్తుల భుజస్కంధాలపై తరలివచ్చిన ప్రభలు.. పైరు పచ్చని సీమలో పట్టపగలే నక్షత్రకాంతులు వెదజల్లాయి. భక్తుల ఓంకార నాదాలు.. ప్రభలకు వేలాడదీసిన జేగంటల శబ్దాలు.. ప్రభలు మోసేవారి అశ్శరభ.. శరభ నినాదాలతో జిల్లాలోని పల్లెల్లో ఆధ్యాత్మిక పరిమళాలు విరిశాయి. కనుమ పండగ అట్టహాసంగా జరిగింది. ప్రభల తీర్థాలతో కోనసీమ ప్రాంతం కళకళలాడింది. **ఆదివారం కొత్తపేటతో ఆరంభమైన ఈ తీర్థాలు మంగళవారం ముక్కనుమ వరకు జరగనున్నాయి. చారిత్రక ప్రసిద్ధి పొందిన అంబాజీపేట మండలం మొసలపల్లి శివారు జగ్గన్నతోట ప్రభల తీర్థానికి వేలాది మంది భక్తులు పోటెత్తారు. స్థానికులే కాకుం**డా వివిధ రాష్ట్రాలోను, దేశాల్లోను ఉపాధి కోసం వెళ్లినవారు తీర్థానికి కుటుంబ సమేతంగా వచ్చారు. గడిచిన రెండేళ్లకన్నా ఈసారి భక్తుల తాకిడి ఎక్కువగా ఉంది. తీర్థానికి సుమారు 60 వేలమందికి పైగా భక్తులు హాజరైనట్టు అంచనా. సంప్రదాయ వస్త్రధారణలతో యువతులు ప్రభల అందాలతో పోటీ పడ్డారు. వృద్ధులు, యువకులు, మహిళలు అనే తేడా లేకుండా తీర్థానికి వచ్చారు. ప్రభల ఊరేగింపు సంప్రదాయ పద్ధతిలో సాగింది. వ్యాఘ్రేశ్వరం నుంచి వ్యాఘ్రేశ్వరస్వామి ప్రభ వచ్చినప్పుడు మిగిలిన ప్రభలను గౌరవ సూచకంగా ఒకసారి పైకి లేపారు. గంగలకుర్రు అగ్రహారం శ్రీ ఉమా పార్వతి సమేత వీరేశ్వరస్వామి, గంగలకుర్రు చెన్నకేశవ మల్లేశ్వరస్వామి ప్రభలు అప్పర్ కౌశిక దాటుకుని వచ్చే దృశ్యాన్ని వేలాది మంది భక్తులు వీక్షించారు. కొన్ని కుటుంబాల వారు గూడు ఎడ్లబండ్లపై తీర్థానికి రావడం పలువురిని ఆకట్టుకుంది.

- అంబాజీపేట మండలంలోనే వాకలగరువు సరిహద్దులో జరిగిన ప్రభల తీర్థంలో వాకలగరువుకు చెందిన ఉమా సర్వేశ్వరస్వామి వారి ప్రభ, తొండవరం ఉమా తొండేశ్వరస్వామి వార్ల ప్రభలు 52 అడుగుల ఎత్తున నిర్మించారు. కోనసీమలో జరిగే ప్రభల తీర్థాల్లో అతి ఎత్తయిన ప్రభలుగా ఇవి గుర్తింపు సంతరించుకున్నాయి.
- కొత్తపేటలో సంక్రాంతి రోజు సోమవారం ప్రభల తీర్థం అంగరంగ వైభవంగా జరిగింది. పురవీధుల్లో ప్రభలను ఊరేగించారు. మధ్యాహ్నం, అర్ధరాత్రి భారీ బాణసంచా కాల్పులు జరిగాయి. పాత రామాలయం, కొత్త రామాలయం ప్రభల ఉత్సవాలు నిర్వహించారు. ఈ వీధులతోపాటు బోడిపాలెం వంతెన ప్రాంతానికి చెందినవారు మందుగుండు కాల్పులు జరిపారు. మందపల్లి, అవిడి డ్యామ్‌సెంటర్, వాడపాలెంలో జరిగాయి. అవిడి డ్యామ్ సెంటర్‌తోపాటు కొత్తపేట మండలం అవిడి, మోడేకుర్రు, పి.గన్నవరం మండలం కుందాలపల్లి, పప్పులవారిపాలెం, అంబాజీపేట చిరతపూడిల నుంచి 15 ప్రభలు ఇక్కడ తీర్థానికి తరలివచ్చాయి.
- మామిడికుదురు మండలం కొర్లగుంటలో జరిగిన తీర్థంలో 12 ప్రభలు కొలువుదీరాయి. ఇక్కడకు సైతం ప్రభలు పంటచేలు, కాలువలు దాటుకుని వచ్చాయి. ఇక్కడకు సైతం జనం రికార్డు స్థాయిలో తరలివచ్చారు.
- కాట్రేనికోన మండలం చెయ్యేరు వద్ద జరిగిన ప్రభల తీర్థానికి సైతం జనం పోటెత్తారు. కాట్రేనికోన, ముమ్మిడివరం మండలాల నుంచి పెద్ద ఎత్తున జనం తరలివచ్చారు. ఇక్కడ ఐదు గ్రామాలకు చెందిన ప్రభలు వచ్చాయి.
- జిల్లాలో ప్రధాన తీర్థాలతోపాటు రావులపాలెం మండలం దేవరపల్లి, పి.గన్నవరం మండలం మానేపల్లి, నాగుల్లంక, పప్పులవారిపాలెం, ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లి, ఎస్.కొత్తపల్లి, వాడపర్రు, సన్నవిల్లి, అమలాపురం మండలం సాకుర్రు గరువు, బండారులంక, అమలాపురం పట్టణంలో గనికమ్మగుడి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, రాజోలు నియోజకవర్గ పరిధిలో మలికిపురం మండలం కేశనపల్లి, తూర్పుపాలెం, రాజోలు పొదలాడ, ముమ్మిడివరం మండలం పల్లిపాలెం, క్రాప చింతలపూడి, చెయ్యేరు, ఐ.పోలవరం శివారు పెదమడి, ఐ.పోలవరం మండలం గుత్తెనదీవి, కపిలేశ్వరపురం మండలాల్లో ప్రభలు తీర్థాలు అంగరంగ వైభవంగా సాగాయి.

గుండాటలు బంద్... తీర్థాలు ఫుల్

జిల్లాలో ఈ ఏడాది జూదం తగ్గింది. గుండాటలు మొత్తం నిలిచిపోయాయి. కోడిపందేలు జరిగినా బరులు తక్కువే. అశ్లీల నృత్యాల జాడే లేదు. ఈ కారణంగా ప్రభల తీర్థాలకు జనం పోటెత్తారు. కుటుంబాల సమేతంగా తీర్థాలకు తరలివచ్చారు. ఈ కారణంగా తీర్థాలు ఇసుక వేస్తే రాలనంతగా మారాయి.

సినిమా షూటింగ్

జగన్నతోట ప్రభల తీర్థంలో సినిమా షూటింగ్ చేశారు. నటీనటులు పాల్గొనకున్నా బ్యాక్‌డ్రాప్‌లో చూపించేందుకు ఇక్కడ కొన్ని సన్నివేశాలను చిత్రీకరించారు. ప్రముఖ నటుడు అక్కినేని నాగార్జున నటిస్తున్న ఇంకా పేరు ఖరారు చేయని సినిమాకు సంబంధించి ఇక్కడ విజువల్స్ తీశారు. విజువల్స్ కోసం రెండు, మూడు కెమెరాలను వినియోగించడంతోపాటు, అతి పెద్ద డ్రోన్ కెమెరాను కూడా వాడారు. ప్రభలు పంట కాలువలు, కౌశిక నది దాటడం, రోడ్ల మీదుగా భక్తుల భుజస్కంధాల మీద ప్రభలు తరలిరావడం... తీర్థానికి వేలాది మంది జనం రావడం, ప్రభలు తిరిగి వెళ్లడం వంటి విజువల్స్‌ను ప్రత్యేకంగా చిత్రీకరించారు.



జగ్గన్నతోటకు ఎగువ కౌశిక దాటి వస్తున్న గంగలకుర్రు చెన్న మల్లేశ్వరుని ప్రభ



కుందాలపల్లి డ్యామ్ సెంటర్‌లో కొలువుదీరిన ప్రభలు



మామిడికుదురులో పీకల లోతు నీటిలో నుంచి తీసుకువస్తున్న పెదపట్నం ప్రభ

ఆటో, బైక్ ఢీ.. ఒకరి మృతి

- తొమ్మిది మందికి గాయాలు

పెద్దాపురం: ఆటో, మోటార్ సైకిల్ ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. పెద్దాపురం - గుడివాడ రోడ్డులో ఈ ప్రమాదం సోమవారం రాత్రి జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. పెద్దాపురం మండలం కాండ్రకోట గ్రామానికి చెందిన పల్ల గణపతి (30) పెద్దాపురం నుంచి కాండ్రకోటకు మోటార్ సైకిల్‌పై వస్తున్నాడు. అదే సమయంలో పెద్దాపురం సత్తెమ్మ తల్లి జాతరకు పులిమేరు నుంచి ప్రయాణికులతో ఆటో వస్తోంది. రెండు వాహనాలూ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో గణపతి కాలు తెగిపోయింది. అతడిని స్థానికులు హుటాహుటిన పెద్దాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గణపతి మృతి చెందాడు. కాగా ప్రమాదంలో ఆటో బోల్తా పడటంతో అందులోని తొమ్మిది మంది గాయపడ్డారు. వీరిలో ఇద్దరు చికిత్స పొందుతూండగా ఏడుగురు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. పెద్దాపురం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా సత్యదేవుని ప్రభ ఉత్సవం

- అన్నవరం గ్రామంలో కోలాహలంగా ఊరేగింపు
- ముగిసిన ధనుర్మాసోత్సవాలు

అన్నవరం: కనుమ పండగ సందర్భంగా సోమవారం రాత్రి స్థానిక చినరావిచెట్టు వద్ద ఉన్న పురగిరి క్షత్రియుల రామకోవెల వద్ద సత్యదేవుని ప్రభ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం ఆరు గంటలకు సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్ల ఉత్సవమూర్తులను, క్షేత్ర పాలకులు సీతారాములను రత్నగిరి నుంచి పల్లకీల మీద ఊరేగింపుగా రావిచెట్టు వద్ద ఉన్న రామకోవెలకు తీసుకువచ్చారు. అక్కడ స్వామి, అమ్మవార్లకు రామకోవెల ధర్మకర్త సోము జోగురాయుడు కుటుంబ సభ్యులు ఘన స్వాగతం పలికారు. వేద పండితులు రామకోవెలలో రెండు ప్రత్యేక ఆసనాలపై సత్యదేవుడిని, అమ్మవారిని, సీతారాములను వేంచేయించి, ప్రత్యేక పూజలు నిర్వహించి, వేదాశీస్సులు అందజేశారు. అనంతరం సర్వాంగ సుందరంగా అలంకరించిన ప్రభపై స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రతిష్ఠించి, రాత్రి 8 నుంచి 9 గంటల వరకూ గ్రామంలో కోలాహలంగా ఊరేగించారు. పురగిరి క్షత్రియ నాయకుడు సోము జోగురాయుడు, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. దేవస్థానం వేద పండితుడు ముష్టి కామశాస్త్రి, ప్రధానార్చకుడు కోట శ్రీనివాస్, అర్చకులు కంచిభట్ల సాయిరామ్, గాడేపల్లి పవన్, స్పెషల్ గ్రేడ్ వ్రత పురోహితుడు ముత్య సత్యనారాయణ, కల్యాణబ్రహ్మ చామర్తి వేంకటరెడ్డి పంతులు (కన్నబాబు) తదితరులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన నాదస్వర సంగీతం, తప్పెటగుళ్లు, కోలాటం భక్తులను అలరించాయి. గత నెల 16 నుంచి అన్నవరంలో నిర్వహిస్తున్న సత్యదేవుని ధనుర్మాసోత్సవాలు కనుమ పండగ నాడు నిర్వహించిన ప్రభ ఉత్సవంతో ఘనంగా ముగిశాయి. ఈ నెల రోజులూ సత్యదేవుడు, అమ్మవారిని గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఘనంగా ఊరేగించారు. తమ ఇళ్ల ముంగిటకు వచ్చిన స్వామి, అమ్మవార్లకు గ్రామస్తులు ఘనంగా నివేదనలు సమర్పించారు.



సత్యదేవుడు, అమ్మవార్లకు పండితుల ప్రత్యేక పూజలు



అన్నవరం గ్రామంలో సాగుతున్న ప్రభ ఉత్సవం

క్లుప్తంగా

నేటి నుంచి పీఠంలో 'గాడ్' 87వ జన్మదిన వేడుకలు

19న పలువురు ప్రముఖుల రాక


పీఠాధిపతి గాడ్

రాయవరం: రాయవరం మండలం వెదురుపాక విజయదుర్గా పీఠాధిపతి వాడ్రేవు వెంకటసుబ్రహ్మణ్యం (గాడ్) 87వ జన్మదిన వేడుకలు మంగళవారం పీఠంలో ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించి ఏర్పాట్లను పూర్తి చేసినట్లు పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, పీఠం పీఆర్వో వాడ్రేవు వేణుగోపాల్(బాబి)లు సోమవారం విలేకరులకు తెలిపారు. ఉదయం 10 గంటలకు జ్యోతి వెలిగించడం, గోపూజ, లక్ష్మీగణపతి హోమంతో జన్మదిన వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. ఉదయం 11 గంటలకు తమిళనాడు తిరుత్తణి శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం, లక్ష్మీగణపతి, నవగ్రహ, సూర్య, మృత్యుంజయ హోమాలు, ఏకవార రుద్రాభిషేకం నిర్వహించనున్నారు. సాయంత్రం ఆరు గంటలకు కడలి కపోతేశ్వరస్వామి, అమ్మవార్ల దివ్య కల్యాణం నిర్వహిస్తున్నారు. 18న ఉదయం 10 గంటలకు తిరుమల తిరుపతి దేవస్థానం వైఖానస పండితుల ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవిజయ వేంకటేశ్వరస్వామి వారి దివ్య కల్యాణం, సాయంత్రం ఆరు గంటలకు విజయదుర్గాదేవికి 108 ప్రత్యేక హారతులు నిర్వహిస్తారు.

19న గాడ్ జన్మదిన వేడుకలు

పీఠాధిపతి వాడ్రేవు వెంకటసుబ్రహ్మణ్యం(గాడ్) జన్మదిన వేడుకలు 19న నిర్వహిస్తారు. జన్మదిన వేడుకలకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి పలువురు ప్రముఖులు హాజరు కానున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


సతీష్ మృతదేహం

గోకవరం: మండలంలోని కృష్ణునిపాలెం పంచాయతీ పరిధిలోని రామన్నపాలెంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. వివరాలు ప్రకారం గోకవరంలో స్థానిక సంజీవ్‌నగర్‌కు చెందిన నందూరి సతీష్(23) ప్రయాణిస్తున్న బైక్‌కు ఎదురుగా మరో బైక్ వచ్చి ఢీ కొట్టడంతో సతీష్ తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న గోకవరం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని రాజమండ్రి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చెలరేగిన బ్లేడ్ బ్యాచ్

- ధవళేశ్వరంలో కత్తితో విచక్షణారహితంగా దాడి
- నడిరోడ్డుపై యువకుడి హత్య
- స్థానికుల ఆందోళన.. పోలీసుల తీరుపై ఆగ్రహం
- ప్రధాన రహదారిపై స్తంభించిన ట్రాఫిక్


ఆందోళన చేస్తున్న స్థానికులు


హతుడు అండిబోయిన రాజేష్ (పాతచిత్రం)


మోహరించిన పోలీసులు

ధవళేశ్వరం: ప్రశాంతంగా ఉన్న ధవళేశ్వరం గ్రామంలో బ్లేడ్‌బ్యాచ్ ఆగడాలతో గ్రామస్తులు తీవ్ర భయాందోళనలు చెందుతున్నారు. బ్లేడ్‌బ్యాచ్ దుండగులు నడిరోడ్డుపై విచక్షణారహితంగా కత్తులతో దాడి చేసి అమాయకుల ప్రాణాలు హరిస్తున్నారు. బ్లేడ్‌బ్యాచ్ సభ్యుడి దాడిలో ధవళేశ్వరం కంచర్లలైన్ ప్రాంతానికి చెందిన యువకుడు అండిబోయిన రాజేష్ (23) మృతి చెందడం తీవ్ర ఉద్రిక్తతలకు దారి తీసింది. ఈ దారుణంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు.

కత్తితో దాడి

తాపీ పని చేసుకుంటూ జీవిస్తున్న అండిబోయిన రాజేష్ తండ్రి గతంలో మృతి చెందారు. తల్లి, రాజేష్ కలిసి జీవనం సాగిస్తున్నారు. అతడికి వచ్చే నెలలో వివాహం నిశ్చయమైంది. సోమవారం సాయంత్రం ధవళేశ్వరం కంచర్లలైన్ సెంటర్‌లో రాజేష్ ఉన్నాడు. ఆ సమయంలో బ్లేడ్ బ్యాచ్‌కు చెందిన ముగ్గురు సభ్యులు బైక్‌పై అక్కడకు వచ్చారు. రాజేష్‌ను వెయ్యి రూపాయలు అడిగారని స్థానికులు చెబుతున్నారు. అడిగిన డబ్బులు ఇవ్వకపోవడంతో రాజేష్‌ను ఇందిరా కాలనీకి చెందిన బ్లేడ్‌బ్యాచ్ సభ్యుడు (మైనర్) కత్తితో విచక్షణారహితంగా పొడిచాడు. అనంతరం ముగ్గురు దుండగులూ అక్కడి నుంచి పరారయ్యారు. రక్తపు మడుగులో ఉన్న రాజేష్‌ను స్థానికులు రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. దాడికి పాల్పడిన బాలుడిపై ధవళేశ్వరంలో ఇప్పటికే ఎనిమిది కేసులు నమోదయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. నిందితుల కోసం గాలిస్తున్నారు. రాజేష్ హత్యతో అతడి తల్లి రోడ్డున పడింది.

స్థానికుల ఆగ్రహం

బ్లేడ్‌బ్యాచ్ దాడిలో రాజేష్ మృతి చెందడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహంతో రగిలిపోయారు. ధవళేశ్వరం ప్రధాన రహదారిపై మంటలు వెలిగించి, బైఠాయించారు. రాజేష్‌ను హత్య చేసిన బ్లేడ్‌బ్యాచ్ యువకుడిని తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. దీంతో గ్రామంలో రాత్రి తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో పెద్ద ఎత్తున ట్రాఫిక్ స్తంభించిపోయింది. పోలీసులు కూడా పెద్ద సంఖ్యలో మోహరించారు. ప్రధాన రహదారి మీదుగా వచ్చే ట్రాఫిక్‌ను పోలీసులు మళ్లించారు. ఆందోళనకారులతో చర్చలు జరిపారు.

బ్లేడ్‌బ్యాచ్ పని పట్టాలి

ధవళేశ్వరంలో రోజురోజుకూ పేట్రేగిపోతున్న బ్లేడ్ బ్యాచ్ సభ్యులపై పోలీసు ఉన్నతాధికారులు దృష్టి సారించాలని కంచర్లలైన్ ప్రాంత వాసులు డిమాండ్ చేస్తున్నారు. సోమవారం దాడికి ఒడిగట్టిన బ్లేడ్ బ్యాచ్ సభ్యులు తరచుగా కంచర్లలైన్ ప్రాంత వాసులపై దాడులకు పాల్పడుతున్నారని, అయినప్పటికీ పోలీసులు తూతూమంత్రంగా చర్యలు తీసుకోవడంతో వారి ఆగడాలు మరింత పెరిగిపోతున్నాయని ఆరోపించారు. బ్లేడ్‌బ్యాచ్ పని పట్టే విధంగా చర్యలు తీసుకునేందుకు ప్రత్యేక పోలీస్ బృందాన్ని నియమించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

నేనూ హీరో చిరంజీవి అభిమానినే

సినీ దర్శకుడు బాబీ


పద్మప్రియ థియేటర్‌లో ప్రేక్షకులనుద్దేశించి ప్రసంగిస్తున్న దర్శకుడు బాబీ

కాకినాడ కల్చరల్: తాను 20 ఏళ్ల నుంచి సినీ హీరో చిరంజీవి అభిమానని, ఆయనతో హిట్ సినిమా చేయడం ఆనందంగా ఉందని వాల్తేరు వీరయ్య సినిమా డైరెక్టర్ బాబీ అన్నారు. స్థానిక పద్మప్రియ కాంప్లెక్స్‌ను సోమవారం సందర్శించారు. మ్యాట్నీ ప్రదర్శన సమయంలో ప్రేక్షకులను ఉద్దేశించి మాట్లాడారు. సినిమాలో ప్రతి సన్నివేశం ప్రాణం పెట్టి తీశామని, ఇంతగా హిట్ అవ్వడం సంతోషంగా ఉందన్నారు. అవకాశం వస్తే చిరంజీవితో సినిమాలు చేయడానికి సిద్ధంగా ఉంటానన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న సినీ దర్శకుడు కల్యాణ్‌కృష్ణ మాట్లాడుతూ ఇప్పటికి రెండు హిట్ చిత్రాలు ఇచ్చానని, మరిన్ని హిట్ సినిమాలు అందించేందుకు కృషి చేస్తున్నానన్నారు. వింటేజ్ సంస్థ అధినేత శివరామ్, చిన్ని, బెనర్జీ పాల్గొన్నారు.

కోడి కత్తి తగిలి ఇద్దరి మృతి

వేలంక, అనంతపల్లిల్లో ఘటనలు


సూర్యప్రకాష్ మృతదేహం



మృతుడు సూర్యప్రకాష్ (ఫైల్) పద్మారావు (ఫైల్)

కిర్లంపూడి/నల్లజర్ల: సంక్రాంతి పండగ వేళ ఆ రెండు కుటుంబాల్లో విషాదం చోటు చేసుకుంది. వేర్వేరు ఘటనల్లో ఆదివారం చట్ట వ్యతిరేకంగా కోళ్లకు కట్టిన కత్తులు తగిలి ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం వేలంకలో కోడిపందేలు జరుగుతున్నాయి. ఇక్కడ చట్ట నిబంధనలు ఉల్లంఘించి కాళ్లకు కత్తులు కట్టి రెండు కోళ్లను బరిలోకి దించారు. అవి బరిలో పోట్లాడుకుంటున్న సమయంలో పందేలు వీక్షిస్తున్న వారి పైకి ఓ కోడి హఠాత్తుగా దూకింది. ఈ ఘటనలో అదే గ్రామానికి చెందిన గండే సూర్యప్రకాష్ (43) మోకాలి పై భాగంలో కోడి కత్తి తగిలి తీవ్రంగా రక్త స్రావమైంది. స్థానికులు వెంటనే ప్రత్తిపాడు ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి సోదరుడు బ్రహ్మవిష్ణుమహేశ్వరులు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తిరుపతిరావు చెప్పారు. సూర్యప్రకాష్‌కు భార్య కనకలక్ష్మి, కుమారులు పవన్, సంతోష్ ఉన్నారు. ఇదిలా ఉండగా, తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల మండలం అనంతపల్లిలో ఆదివారం మధ్యాహ్నం కోడిపందేలు నిర్వహించారు. ఇక్కడ కూడా చట్ట విరుద్ధంగా పందెం కోడికి కత్తి కడుతుండగా ఒక్కసారిగా కోడి పైకి ఎగిరింది. ఈ క్రమంలో దానికున్న కత్తి.. పెరిగిన పద్మారావు (21) మోకాలి వెనుక గుచ్చుకొంది. ఈ ప్రమాదంలో అతడి కాలు కొంతమేర తెగి తీవ్ర రక్తస్రావమైంది. ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో పద్మారావు మృతి చెందినట్టు నల్లజర్ల సీఐ లక్ష్మణరెడ్డి చెప్పారు.

మోటార్ సైకిళ్లు ఢీ: వ్యక్తి మృతి

ఐ.పోలవరం: మోటారు సైకిళ్లు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్ర గాయాల పాలైన ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. యానాం–ఎదుర్లంక వారధిపై ఆదివారం రెండు మోటారు సైకిళ్లు ఎదురెదురుగా వస్తూ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో యానాం నుంచి కొమరగిరి వస్తున్న శ్రీకాకుళం జిల్లా పార్వతీపురానికి చెందిన పువ్వుల ఈశ్వరరావు (30) అక్కడికక్కడే మృతి చెందాడు. కొమరగిరి నుంచి యానాం వెళ్తున్న వ్యక్తికి తీవ్ర గాయాలు కావడంతో కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. ప్రమాదంలో మృతిచెందిన ఈశ్వరరావు కొమరగిరిలో ఓ రైతు ఆక్వా చెరువుల దగ్గర కాపలాదారుగా పని చేస్తున్నాడు. ఘటనా స్థలానికి ఎస్‌ఐ రాజేష్ వెళ్లారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ముమ్మిడివరం: మద్యానికి బానిసై మానసిక స్థితి సరిగాలేక ఒక వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ముమ్మిడివరం మార్కెట్ ప్రాంతంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. మార్కెట్ ప్రాంతానికి చెందిన బండా అబ్బులు(54)పాత ఇనుము కొనుక్కుంటూ జీవనం సాగిస్తున్నాడు. మానసిక స్థితి సరిగా లేక రోజు మద్యం సేవించి వచ్చి చుట్టుపక్కల వారిని దుర్భాషలాడుతుంటాడు. ఈ క్రమంలో ఆదివారం ఇరుగు పొరుగు వారిని తిడుతుండగా అతని సోదరి మందలించడంతో బయటకు వెళ్లి మద్యం సేవించి ఇంటి పోర్టికోలో ఉరి వేసుకున్నాడు. అతనిని బంధువులు స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ కె.సురేష్‌బాబు తెలిపారు.

వ్యక్తి దుర్మరణం

దేవరపల్లి: మండలంలోని యర్నగూడెం శివారు సూర్యనారాయణపురం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కొవ్వూరు మండలం ఐ.పంగిడికి చెందిన బుడిగిన శ్రీను(48) మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం ఐ.పంగిడికి చెందిన బుడిగిన శ్రీను మోటారు సైకిల్‌పై తాడేపల్లిగూడెం రూరల్ మండలం కూనవరం బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తూ సూర్యనారాయణపురం వద్ద అదుపుతప్పి పడిపోయాడు. ఈ ప్రమాదంలో శ్రీను తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్టు ఎస్‌ఐ కె. శ్రీహరిరావు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

వందే భారత్ రైలు ఓ సంచలనం

- ఎంపీ మార్గాని భరత్‌రామ్
- రాజమహేంద్రవరంలో ఘన స్వాగతం


రైలుకు స్వాగతం పలుకుతున్న ఎంపీ భరత్‌రామ్, కలెక్టర్ మాధవీలత, జెడ్పీ చైర్మన్ విప్పర్తి తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: విశాఖపట్నం – సికింద్రాబాద్‌ల మధ్య వందే భారత్ హై స్పీడు ఎక్స్‌ప్రెస్ రైలు సేవలు ప్రారంభం కావడం ఓ సంచలనమని ఎంపీ మార్గాని భరత్‌రామ్ ఆనందం వ్యక్తం చేశారు. సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం తొలి సారిగా వెళుతున్న వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌కు ఆదివారం రాత్రి రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌లో అధికారులు, ప్రజాప్రతినిధులు మంగళ వాయిద్యాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఎంపీ భరత్‌రామ్, కలెక్టర్ డాక్టర్ కె. మాధవీలత తదితరులు రైలులో కొద్దిసేపు కూర్చుని లోపలి భాగాలను పరిశీలించి రైల్వే అధికారులను పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. హాల్ట్ అనంతరం విశాఖపట్నం బయలుదేరిన వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌కు ఎంపీ భరత్‌రామ్, కలెక్టర్ మాధవీలత, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు జెండా ఊపి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్ రామ్ మీడియాతో మాట్లాడుతూ 2023 ఆరంభంలో ప్రారంభించిన ఈ రైలు సరికొత్త సంచలనం అన్నారు. మారుతున్న కాలంతో ప్రయాణీలకు అవసరాలకు తగ్గట్టు ఇటువంటి రైళ్లు మరిన్ని రావాలన్నారు. వర్తక, వాణిజ్య రంగాలలో వారే కాకుండా చాలామంది విమాన ప్రయాణాలపైనే ఆసక్తి చూపిస్తున్నారని, చాలా త్వరగా గమ్యానికి చేరుకోవాలనే ఆలోచనతో సంపన్నులు రైలు ప్రయాణం కంటే విమానయానానికే ప్రాధాన్యం ఇస్తున్న తరుణంలో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైల్వే శాఖలో సువర్ణాధ్యాయంగా చెప్పుకోవచ్చునన్నారు. ఉత్తర కాశీని, దక్షిణ కాశీ రాజమహేంద్రవరాన్ని కలుపుతూ వందేభారత్ రైలు అవసరం ఉందన్నారు. కొవ్వూరు–భద్రాచలానికి కొత్త రైలు అవసరం ఉందన్నారు. ఇదే విషయమై అనేకసార్లు పార్లమెంటులో ప్రస్తావించినట్టు చెప్పారు. కోస్తా ప్రాంతంలో పలు కొత్త రైల్వే లైన్లు, కొత్త రైళ్లు వేయవలసిన అవసరం ఉందన్నారు. కొత్త రైళ్లు వస్తున్న తరుణంలో అవసరం ఉన్నచోట ఎల్వోబీ, ఆర్వోబీలను తీసుకురావలసిన అవసరం ఉందన్నారు. భద్రతకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ప్రయాణికుల అవసరాన్ని గుర్తించి వందే భారత్ బుల్లెట్ ట్రైన్ సేవలు అందుబాటులోకి తీసుకువచ్చిన ప్రధాని మోదీకి ఎంపీ భరత్‌రామ్ కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, మాజీ కార్పొరేటర్ పిల్లి నిర్మల, రైల్వే స్టేషన్ మేనేజర్ గంగా ప్రసాద్, చీఫ్ టికెట్ ఇన్‌స్పెక్టర్ కేశవభట్ల శ్రీనివాసరావు, ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సైదయ్య, బీజేపీ నాయకులు రేలంగి శ్రీదేవి, బొమ్ముల దత్తు పాల్గొన్నారు.

కోడిపందేల వద్ద సినీ తారల సందడి


వలసపాకలలో కోడిపందేలు తిలకిస్తున్న సినీ దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ, నటుడు కృష్ణుడు


కాకరపర్రులో అభిమానులతో సినీ డైరెక్టర్ వీవీ వినాయక్


పడమటిపాలెం సంక్రాంతి ఉత్సవాల్లో పాల్గొన్న కిరణ్ అబ్బవరం


చెముడులంకలో ఎడిటర్ ప్రసాద్‌ను అభినందిస్తున్న వైఎస్సార్ సీపీ నేత తమ్మన

కాకినాడ రూరల్: సంక్రాంతి సంబరాలలో భాగంగా కాకినాడ రూరల్‌లో సినీతారలు సందడి చేశారు. వలసపాకల గ్రామంలో కోడిపందేలను తిలకించేందుకు పలువురు నటులు, దర్శకులు హాజరయ్యారు. సంక్రాంతి రోజు వలసపాకలలో కోడిపందేలను ప్రముఖ సినీ దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ తిలకించారు. ఆయనతోపాటు నటుడు కృష్ణుడు కూడా ఉన్నారు. వాల్తేరు వీరయ్య సినిమా దర్శకుడు బాబి పందేలను తిలకించారు. కోనసీమ జిల్లా కొమరగిరికి చెందిన పలువురు కోడిపందేలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దర్శకుడు వర్మ మాట్లాడుతూ పండగ కోసం సరదాగా కాకినాడ వచ్చానని, కోడిపందేలను తిలకించినట్టు తెలిపారు. సాయంత్రం సినీ దర్శకుడు కల్యాణ్‌కృష్ణ, నటి హేమ, పలువురు సినీనటులు, టీవీ సీరియల్ నటీనటులు సందడి చేశారు. ఇక్కడ ఒకేసారి 8 పుంజులతో గ్రూపు పోటీ నిర్వహించడంతో ఆసక్తిగా తిలకించారు.

సంస్కృతీ సంప్రదాయాలకు నిలయం సంక్రాంతి: సినీ డైరెక్టర్ వీవీ వినాయక్

పెరవలి: సంక్రాంతి పండగ సంస్కృతీ సంప్రదాయాలకు నిలయమని ప్రముఖ సినీ డైరెక్టర్ వీవీ వినాయక్ పేర్కొన్నారు. పెరవలి మండలం కాకరపర్రులో మహాలక్ష్మి అమ్మవారిని సోమవారం దర్శించుకుని ఆయన అభిమానులతో కొద్దిసేపు ముచ్చటించారు. హిందూ సంప్రదాయంలో సంక్రాంతి పండగకు ఒక ప్రత్యేకత ఉందని, ప్రతి ఇంట పిండి వంటలతో పాటు ముంగిటిలో ముగ్గు లు, తెలుగు సంప్రదాయం ఉట్టిపడుతుందని, వా టిని చూడాలంటే గ్రామాలే వేదికలని తెలిపారు. ఈ సంక్రాంతి పండగ ప్రతి ఇంట సుఖ సంతోషా లు ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు నామ న ఆంజనేయులు, యువకులు పాల్గొన్నారు.

గోదావరి వాసిగా గర్వపడుతున్నా : ఎడిటర్ చోటా కె ప్రసాద్

ఆలమూరు: గోదావరి జిల్లాల వాసిగా జన్మించడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని సినీ ఎడిటర్ చోటా కె ప్రసాద్ అన్నారు. సంక్రాంతి సందర్భంగా మండలంలోని నర్సిపూడిలోనున్న ఆయన స్వగ్రామానికి విచ్చేశారు. తొలుత చెముడులంకలో పర్యటించి అక్కడ జరుగుతున్న కోడి పందేలను తిలకించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసును మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. గుమ్మిలేరులో సర్పంచ్ గుణ్ణం రాంబాబును కలిసి సినిమా విశేషాలపై ముచ్చటించారు. తొలిసారిగా ఎడిటర్ బాధ్యతలు నిర్వహించిన మెగాస్టార్ చిరంజీవి నటించిన వాల్తేరు వీరయ్య అత్యంత ప్రజాదరణ పొందడంపై వారంతా అభినందనలు తెలిపారు. ఎడిటర్ ప్రసాద్ మాట్లాడుతూ జిల్లావాసులు ఇచ్చిన ప్రోత్సాహం ఆదరణ మరువలేనిదన్నారు. ఇదే ఉత్సాహంతో భవిష్యత్‌లో మరిన్ని సినిమాలు చేస్తానన్నారు. త్వరలో ప్రారంభమయ్యే రామ్‌చరణ సినిమాకు ఎడిటర్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నానని చెప్పారు.

పడమటిపాలెంలో హీరో కిరణ్ సందడి

మలికిపురం: మండలంలోని పడమటిపాలెంలో సినీనటుడు కిరణ్ అబ్బవరం సందడి చేశారు. ఆదివారం గ్రామంలో పైడిమాంబ అమ్మవారి ఆలయం వద్ద జరిగిన సంక్రాంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. కోనసీమ చాలా బాగుందని, సంక్రాంతికి ఇక్కడికి రావడం ఆనందంగా ఉందన్నారు. తన సినిమాలను కోనసీమ వాసులు ఎంతో ఆదరించారని అన్నారు. రాబోయే తన సినిమా 'వినరో భాగ్యము విష్ణు కథ'ను కూడా ఆదరించాలన్నారు. మాజీ సర్పంచ్ ఆకుల నాయుడు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యులతో జరుపుకుంటే అసలైన సంక్రాంతి

సినీ డైరెక్టర్ శ్రీవాస్


శ్రీవాస్, సినీ డైరెక్టర్

సీతానగరం: కుటుంబ సభ్యులు, స్నేహితులతో జరుపుకుంటేనే అసలైన సంక్రాంతి అని సినీ డైరెక్టర్ శ్రీవాస్ సోమవారం అన్నారు. సినీ డైరెక్టర్ శ్రీవాస్ సినీ షూటింగ్‌లో ఎంత బిజీగా ఉన్నా ప్రతి ఏడాది సంక్రాంతి పండగకు తన పుట్టిన ఊరు పురుషోత్తపట్నం వచ్చి తన కుటుంబ సభ్యులు, స్నేహితుల మధ్య సంక్రాంతిని జరుపుకుంటారు. ఈ ఏడాది తన పుట్టిన ఊరు వచ్చి సంక్రాంతిని ఘనంగా జరుపుకున్నారు. శ్రీవాస్ దర్శకత్వంలో గోపీచంద్ హీరోగా గతంలో తీసిన లక్ష్యం, లౌక్యం సినిమాలు మంచి పేరును తెచ్చిపెట్టాయి. తాజాగా పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్, వివేక్ కూచిభొట్ల నిర్మాతలుగా, హీరో గోపీచంద్, హీరోయిన్‌గా డింపుల్ హయతి, అన్నా వదిన పాత్రల్లో జగపతిబాబు, ఖుష్బూ నటిస్తున్నారు. శ్రీవాస్ విలేకరులతో మాట్లాడుతూ ఈ చిత్రం పేరును 'రామబాణం'గా ఖరారు చేశామని, సమ్మర్‌లో విడుదల చేస్తామని అన్నారు.